క్లుప్తంగా

మారుతి ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రారంభం



పెదరావూరు(తెనాలి): తెనాలి రూరల్ మండలం పెదరావూరులో నూతనంగా ఏర్పాటు చేసిన మారుతి ఆగ్రో ఇండస్ట్రీస్‌ను గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ప్రారంభించారు. సంస్థలోని ఇతర విభాగాలను స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, దెందులూరు ఎమ్మెల్యే కె.అబ్బయ్యచౌదరి ప్రారంభించారు. తెనాలి ప్రాంతంలో విస్తారంగా పండించే మొక్కజొన్న, తెల్లజొన్నల కొనుగోళ్లు, ప్రాసెసింగ్ కోసం అత్యాధునిక టెక్నాలజీతో మారుతి ఆగ్రో ఇండస్ట్రీస్‌ను ఏర్పాటు చేసినట్టు యజమానులు తుమ్మపూడి శ్రీనివాసశేఖర్, తుమ్మపూడి హేమలత వెల్లడించారు. అనంతరం తెనాలి గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి విచ్చేసిన మంత్రి డాక్టర్ నాగార్జున, దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని ఎమ్మెల్యే శివకుమార్ సత్కరించారు.

భగవాన్ వెంకయ్యస్వామికి పూజలు



తెనాలి టౌన్: రూరల్ మండలం సంగంజాగర్లమూడిలోని శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాసన సభ్యుడు అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని విశేష పూజలు జరిపారు. మందిర నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రయాన్‌పై సినిమా తీయండి

సినీ దర్శకుడు దిలీప్‌రాజా



తెనాలి అర్బన్: ప్రపంచం గర్వించేలా భారత శాస్త్రవేత్తలు సాధించిన చంద్రయాన్–3 విజయంపై జాతీయ చలన చిత్ర అభివృద్ధి సంస్థ సినిమా నిర్మించాలని మా ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా కోరారు. తెనాలిలోని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్ర మండలపై మనిషి జీవించే అవకాశం భవిష్యత్‌లో కలగవచ్చనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దీనిని ఆధారంగా చేసుకుని సినిమాను రూపొందించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తెనాలి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అధికారులు సీజ్ చేశారు. ఎటువంటి బిల్లులు లేకపోవడంతో తెనాలి మండలం సోమసుందరపాలెం వద్ద ట్రాక్టర్‌ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏ.వి.చలం, సిబ్బంది గురువారం గుర్తించారు. వాహన యజమానిపై కేసు నమోదు చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు.

పూల మార్కెట్లో తనిఖీలు



నెహ్రూనగర్: వ్యాపారస్తులు తప్పనిసరిగా లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా స్టాంపింగ్ వేయించుకున్న తర్వాతే తూకాల్ని వాడాలని ఆ శాఖ డెప్యూటీ కంట్రోలర్ షాలేం రాజు తెలిపారు. స్టాంపింగ్ వేయించకుండా వ్యాపారం చేసే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా వినియోగదారులు ఎక్కువగా పూలు కొంటున్న నేపథ్యంలో గురువారం మార్కెట్లో తనిఖీ నిర్వహించారు. స్టాంపింగ్ నిబంధన పాటించని ఐదుగురు వ్యాపారస్తులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గుంటూరు వాసి గుళ్లపల్లిలో మృతి

చెరుకుపల్లి: కొంతకాలంగా ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్న పెయింటర్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గుళ్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వై.సురేష్ వివరాల మేరకు.. నరహరిశెట్టి కిశోర్(42) ఎనిమిది నెలలుగా గుళ్లపల్లి జెండా చెట్టు సమీపంలోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటుంటున్నాడు. పెయింట్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అతను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పట్టించుకునే వారు లేక బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మృతి చెందాడు. అతడి వద్ద లభించిన ఆధారాల మేరకు గుంటూరులోని నాగేశ్వరరావు వీధికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. తండ్రి రాధాకృష్ణగా సమాచారం. మృతుడి బంధువులు వివరాలు తెలియరాలేదని, వీఆర్‌వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు 94409 00874, 49907 96166, 08648–247233 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ప్రజల సమస్యల పరిష్కారమూ ముఖ్యమే..

- ఏడో 'వార్డులో ఒక రోజు'లో ఎమ్మెల్యే శివకుమార్
- 'గడప గడపకు'లో వినతులపై సమీక్ష
- వార్డులో అభివృద్ధి పనుల తనిఖీ



సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: సంక్షేమంతో పాటు ప్రజల సామాజిక సమస్యల పరిష్కారం కూడా సంతృప్త స్థాయిలో ఉండాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్పష్టం చేశారు. ప్రజలు మన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించి, వారి మన్ననలు పొందాలని సూచించారు. వార్డులో ఒకరోజు పర్యటనలో భాగంగా గురువారం ఏడో వార్డు సచివాలయాన్ని ఆయన సందర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్, 7వ వార్డు కౌన్సిలరు మాలేపాటి హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావుతో కలిసి సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా వార్డులోని ఇంటింటికీ వెళ్లినపుడు స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై సమీక్షించారు. వార్డులో మొత్తం 10 సమస్యలు వచ్చాయి. అందులో మూడు మాత్రమే వ్యక్తిగతమైన సంక్షేమ పథకాలు కాగా, మిగిలిన ఏడూ సామాజిక అంశాలే కావడం గమనించాల్సిన అంశం. వ్యక్తిగత అభ్యర్థనల్లో ఇద్దరికి పింఛన్లు, మరొకరికి అమ్మఒడి లబ్ధిపై చేసిన వినతుల్ని పరిష్కరించారు. కందూరు శ్రీనివాస యోగానంద లక్ష్మీనరసింహ, నాము జయలక్ష్మి అభ్యర్థన ప్రకారం వారికి పింఛన్లు మంజూరు చేశారు. ఇదే విషయమై ఎమ్మెల్యే శివకుమార్ వారితో నేరుగా ఫోనులో మాట్లాడారు. తమకు నెలనెలా పింఛన్లు వస్తున్నాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తంచేశారు. ఇక్కడే స్థిరపడిన నేపాల్‌కు చెందిన సునీతా సింగ్ చేసిన వినతిప్రకారం అమ్మఒడి లబ్ధిని చేకూర్చారు.ఆ విషయాన్ని ఫోనులో నేరుగా ఆమెతోనే మాట్లాడి ఎమ్మెల్యే ధ్రువీకరించుకున్నారు. మురుగు కాల్వ సమస్య, ఫాగింగ్, చెట్ల కొమ్మల తొలగింపు వంటి సమస్యలపై చెప్పిన వ్యక్తులతోనూ మాట్లాడి, వారి స్పందనను తెలుసుకున్నారు. నెల నెలా రేషను ఇచ్చే ఎండీయూ వాహనాలు, ఏయే తేదీల్లో వార్డులో రేషను ఇచ్చేదీ ప్రజలకు తెలియజేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గత మూడు నెలలుగా నిర్ణీత సమయం లేకుండా వస్తున్నారంటూ ఫిర్యాదులు వస్తున్నట్టు చెప్పారు. వార్డులో మురుగునీటి కాల్వలు పరిశుభ్రంగా ఉంచాలని, వీధిలైట్లను పట్టించుకోవాలని, దోమల నివారణకు ఫాగింగ్ క్రమం తప్పకుండా జరగాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సచివాలయం పరిధిలో గడప గడపకు నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షించారు. మొత్తం నాలుగు పనుల్లో రెండు పూర్తయినట్టు అధికారులు సమాచారమిచ్చారు. సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లతో ఎమ్మెల్యే శివకుమార్ ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

అనంతరం అదే ప్రాంగణంలో నడుస్తున్న వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. అందుబాటులో నిర్మించిన ఆరోగ్య కేంద్రం రోగుల ఆదరణ పొందుతున్నట్టు తెలుసుకుని ఆనందం వ్యక్తంచేశారు. తర్వాత కొత్తపేటలోని సాంఘిక సంక్షేమ గిరిజన గురుకుల వసతి గృహం, పాఠశాల ప్రాంగణంలో రూ.50 లక్షలతో, మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో రూ.2 కోట్లతో నాడు–నేడు కింద నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను తనిఖీ చేశారు. పనుల ప్రగతిని సమీక్షించారు. అక్కడ్నుంచి వార్డు కౌన్సిలరు మాలేపాటి హరిప్రసాద్ నివాసంలో ముఖ్య కార్యకర్తలు, గృహసారథులతో సమావేశమయ్యారు. పార్టీ పనితీరు, వార్డులోని పరిస్థితులు, ఇంకా చేయాల్సినవి ఏవైనా ఉన్నాయా? అనే అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఆరిమండ రామిరెడ్డి, శంకరరెడ్డి, కొల్లిపర రాజా, మాలేపాటి తిరుమలేశ్వరరావు, మాలేపాటి హేమకుమార్, సంకా సతీష్, సంకా రాము, నంబూరు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులకు 'సంక్షేమం' ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే శివకుమార్
- కొలకలూరులో నాలుగో రోజు గడప గడపకు మన ప్రభుత్వం

తెనాలి టౌన్: అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నాలుగో రోజు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో వాకబు చేశారు. సమస్యలు ఉన్నట్లయితే తెలియజేయాలని సూచించారు. ప్రజలు తెలియజేసిన సమస్యల్ని సచివాలయ సిబ్బంది నమోదు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ సమస్యల్ని ప్రణాళిక ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దోసపాటి నాగదేవిక, కాలిశెట్టి ఫణికుమార్, చక్కా సీతమ్మ, డీసీఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, సొసైటీ చైర్మన్ గంపల పెద్దబ్బాయి, పార్టీ నాయకులు దూళ్ల శ్రీనివాసరావు, బర్తిపూడి బాపిరాజు, కొలకలూరు నాగేశ్వరరావు, పినపాటి అనిల్, మల్లవరపు బుల్లయ్య, విజయ్, ప్రసాదం సురేష్, రాధారాం, సుమతి, వీరమల్లు వెంకయ్య, కార్తికేయ, అంచె రోశయ్య, కొలకలూరి రాజయ్య, రావూరి రవిబాబు, కాలిశెట్టి సుబ్బారావు, పోలిశెట్టి కోటేశ్వరరావు, మూర వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, లక్ష్మీరెడ్డి, వీరారెడ్డి, రోశిరెడ్డి, కొమ్ము రాయల్, కొండారెడ్డి, ఫరీద్, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్వీఆర్ పురస్కారానికి 'ఆళ్ల' ఎంపిక



తెనాలి అర్బన్: హైదరాబాద్‌కు చెందిన అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అందించే ఎస్వీ రంగారావు జీవితకాల సాఫల్య పురస్కారం– 2023కి తెనాలికి చెందిన కవి ఆళ్ల నాగేశ్వరరావు ఎంపికయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.సరోజమ్మ ధ్రువపత్రాల్ని పంపినట్లు నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 27న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రతిభా సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కాకరపర్తి సుబ్రహ్మణ్యం, కోశాధికారి విష్ణుమొలకల భీమేశ్వర ప్రసాద్, ఎం.వి. రఘునాథరావు, తన్నీరు శివశంకర్, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, షేక్ అబ్దుల్ హకీం జానీ అభినందనలు తెలియజేశారు.

పేదలకు అన్నదానం



తెనాలి అర్బన్: వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు షేక్ మీరావలి జన్మదినాన్ని పురస్కరించుకుని కుర్రా శ్రీను ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో గురువారం పేదలకు అన్నదానం చేశారు. బుర్రిపాలెం రోడ్డులోని గోశాలలో గోవులకు పచ్చిమేత, దాణాను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కుర్రా సుజాత, జొన్నాదుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాళిదాసు వెంకటేశ్వరరావు, మునిపల్లి వంశీ, ఎస్.ఆర్.కె. శర్మ, కె.రవిశంకర్ పాల్గొన్నారు.

జయహో ఇస్రో !



తెనాలిలో ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు



మున్నంగి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థుల సంబరాలు

తెనాలి అర్బన్: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతంపై పట్టణంలోని వివిధ సంస్థల ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. బోసు రోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ చౌక్, శివాజీ చౌక్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. ప్రధాన వీధుల్లో విద్యార్థులు మానవహారాలుగా ఏర్పడ్డారు. మేరా భారత్ మహాన్, భారత్ మాతాకీ జై, జయహో ఇస్రో అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నెహ్రూనికేత్ విద్యాసంస్థల ఎండీ దాసరి మురళీకాంత్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ ప్రాక్టీస్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు నారాయణం వేణుగోపాల్, కార్యదర్శి కరేటి పుల్లారావు, నాయకులు భాస్కర్, సాయి గణేష్, సైనిక ఉద్యోగుల సంఘం మాజీ గౌరవాధ్యక్షుడు ఎం.కమల్‌కుమార్, అధ్యక్షుడు ఎం.రాజు, గాయత్రి ఎడ్యుకేషన్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు వేమూరి విజయభాస్కర్, నెహ్రూ నికేతన్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్నంగి ఎంపీపీ పాఠశాలలో చంద్రయాన్ సంబరాలు

మున్నంగి (కొల్లిపర): చంద్రయాన్–3 విజయంలో శాస్త్రవేత్తల కృషికి అభినందనలు తెలుపుతూ గురువారం మండలంలోని మున్నంగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్)లో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు చంద్రయాన్ ప్రాముఖ్యత గురించి వివరించారు.అనంతరం మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాము, ఉపాధ్యాయిని సోమరౌతు లక్ష్మీకమల, అంగన్‌వాడీ టీచర్ అరుణజ్యోతి, సిబ్బంది ఓవేటి లక్ష్మి, భార్గవి, విద్యార్థులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



తెనాలి అర్బన్: విప్లవ గాయకుడు, రచయిత గద్దర్ సంతాప సభను బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో గురువారం తెనాలిలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థిగా ఉన్నప్పుడు గద్దర్ విప్లవ భావాలకు ఆకర్షితుడయ్యాడని తెలిపారు. సమాజం మార్పు కోసం ఉద్యోగాన్ని వదిలేసి గేయ రచయితగా గాయకుడుగా మారి, అట్టడుగు వర్గాల్లో చైతన్యం తీసుకువచ్చాని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చేరువై అనేక ఉద్యమాలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ కుర్రా సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు కాళిదాసు వెంకటేశ్వరరావు, ఎస్.ఆర్.కె. శర్మ, నరసింహారావు, మునిపల్లి వంశీ పాల్గొన్నారు.

కాలువలో పడి వృద్ధుడి మృతి

గుంటూరు ఈస్ట్: కాలువలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెంలోని ఆంథోని చర్చి వెనుక మునగాల రంగారావు (75) మిషన్ కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం తన షాపు సమీపంలోని మురుగు కాలువలో పడి మృతి చెంది ఉన్నాడు. స్థానికులు ఆలస్యంగా గుర్తించారు. రంగారావుకు బంధువులు ఎవరూ లేరని తెలిసింది. 81వ సచివాలయం వార్డు వలంటీర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచం మీద నుంచి పడి ...

మంచం మీద నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారంలో నివసించే కూరపాటి లూకా(32) బుధవారం మంచం మీద నుంచి కిందపడి మృతి చెందాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి నరసింహారావు ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

తెనాలి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ ఆధ్వర్యంలో పాత ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న రక్తనిధి కేంద్రంలో సివిల్ పనులకు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ శంకుస్థాపన చేశారు. రెడ్‌క్రాస్ తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి ఆధ్వర్యంలో రూ.72 లక్షల వ్యయంతో ఈ పనుల్ని చేపట్టారు. దసరా నాటికి రక్తనిధి కేంద్రం ప్రారంభించనున్నట్టు భానుమతి చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాల్సినపుడు గుంటూరు, విజయవాడకు వెళ్లాల్సిన పనిలేకుండా అవసరమైన రక్త యూనిట్లను రక్తనిధి నుంచి పొందే అవకాశం ఉందని తెలిపారు. రక్తం అవసరమైన రోగికి, చికిత్స చేస్తున్న వైద్యుడు సిఫార్సు చేసిన గ్రూపు రక్తాన్ని ఇక్కడ అందించే ఏర్పాట్లు ఉంటాయని మున్సిపల్ వైస్ చైర్మన్, ఆ వార్డు కౌన్సిలరు మాలేపాటి హరిప్రసాద్ చెప్పారు. రక్తకేంద్రానికి స్థలం కేటాయించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పావనీ ప్రియాంక, డాక్టర్ బీబీజాన్, 13వ వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత, రెడ్‌క్రాస్ కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ, ఈసీ సభ్యుడు కుర్రా శ్రీను, జవ్వాజి శ్రీను, సాయి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యానిమేటర్ల సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ

కొల్లిపర: రాష్ట్రంలో యానిమేటర్ల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం, సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మండలంలో గురువారం యానిమేటర్ల నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానిమేటర్లకు రూ. 26వేల వేతనం ఇవ్వాలని కోరారు. 45 సంవత్సరాల వయోపరిమితి తక్షణమే రద్దు చేయాలని, ప్రమాద బీమా అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 23నుంచి 30 వరకు జరిగే జీపు జాతాను జయప్రదం చేయాలని యానిమేటర్లకు విజ్ఞప్తి చేశారు. యానిమేటర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి వి.విజయలక్ష్మి మాట్లాడుతూ మండల నూతన కమిటీ ఎన్నికల్లో అధ్యక్షకార్యదర్శులుగా సామ్రాజ్యం, స్వాతి, కోశాధికారిగా సీయోను, ఉపాధ్యక్షులుగా సువార్త , సహాయ కార్యదర్శిగా నాగదుర్గ, దాసు, సంఘం గౌరవ అధ్యక్షులుగా కోటా చంద్రశేఖర్ ఎన్నికైనట్లు తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎండీవో, ఏపీఎంకు అందజేశారు.

అటవీ సంరక్షణ చట్ట సవరణల రద్దుకు ఉద్యమించాలి

తెనాలి: అటవీ సంరక్షణ చట్ట సవరణల రద్దుకు ప్రజలంతా ఉద్యమించాలని రైతు కూలీ సంఘం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బొల్లిముంత సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆదివాసీ హక్కుల్ని హరించి, అటవీ భూములు, ఖనిజ సంపదను దేశ, విదేశ బడా పెట్టుబడిదారుల పరం చేసేందుకే మోదీ ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టానికి సవరణల్ని చేసిందని ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఈనెల 9,10 తేదీల్లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో చట్ట సవరణల్ని వెంటనే ఉపసంహరించాలని కోరుతూ తీర్మానించినట్టు తెలిపారు. విశాఖపట్నంలో సెప్టెంబరు 12,13 తేదీల్లో జరగనున్న ఆదివాసీ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని కూడా కార్యవర్గం పిలుపునిచ్చినట్టు తెలిపారు. మణిపూర్‌లో గత నాలుగు నెలలుగా మతోన్మాద ప్రేరితమైన మెయితీలు ఆదివాసీ సమూహాలపై జరిగిన దాడులు, హత్యాకాండలను దేశభక్త ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని కార్యవర్గం కోరిందని వెల్లడించారు. యూనిఫాం సివిల్ కోడ్‌ను వ్యతిరేకిస్తూ మరో తీర్మానం చేసినట్టు వివరించారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

కొల్లిపర: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటరు సవరణ ప్రక్రియను నిష్పక్షపాతంగా చేపట్టి శుక్రవారం సాయంత్రం 5గంటల్లోపు పూర్తి చేయాలని తహసీల్దార్ జి.నాంచారయ్య బూత్ లెవల్ ఆఫీసర్ల(బీఎల్‌ఓ)ను ఆదేశించారు. బీఎల్‌ఓలతో గురువారం ఓటరు సవరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకపక్షంగా సర్వే చేయకుండా రాజకీయ పార్టీల ఏజెంట్లను వెంటబెట్టుకొని ఇంటింటా సర్వే చేయాలని చెప్పారు. సర్వే పూర్తయిన వెంటనే నివేదికను కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఆర్‌ఐ శ్రీనివాసరావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు



సజ్జల రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నేతలు. చిత్రంలో ఎమ్మెల్యే గిరి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీని ఆదరిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. మంగళగిరిలోని ఆయన నివాసంలో గురువారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. పేద వారికి తాను ఉన్నాననే భరోసా కల్పించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని స్పష్టం చేశారు. విశ్వబ్రాహ్మణ కమిటీ నగర అధ్యక్షుడు కడియాల సుబ్బారావు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఎంతో పనిచేశామని, అయితే తమ సామాజిక వర్గానికి ఎటువంటి మేలు జరగలేదని తెలిపారు. సీఎం వై.ఎస్.జగన్ నేతృత్వంలో విశ్వబ్రాహ్మణులుకు మేలు చేకూరుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, విశ్వబ్రాహ్మణ కమిటీ నేతలు నాగేశ్వరాచారి, కె.వెంకటభాస్కర్, ఎం.శివరామకృష్ణ, కందుకూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అనంతరం సజ్జల రామకృష్ణారెడ్డికి దుశ్శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులను అభినందిస్తున్న మరుద్వతి, నస్రీన్, వెంకటేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న

గుంటూరు ఎడ్యుకేషన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్. మంగాదేవి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అనుబంధంగా గుంటూరు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన యోగా పోటీల్లో బాలకుటీర్, చౌడవరం చేతన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. అండర్–16 విభాగంలో జి. వినయ్ సాయిరాం, టి. కాశీ యశ్వంత్ ప్రథమ, ద్వితీయస్థానాల్లో, కె. హర్షవర్ధన్, ఎం. లాలా దుర్గాప్రసాద్ 4వ, 5వ స్థానాల్లో నిలిచారని వివరించారు. అండర్–10 విభాగంలో ఎస్.ప్రవల్లిక సలోమి ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరగనున్న యోగా పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా మంగాదేవి మాట్లాడుతూ యోగాను దినచర్యలో భాగంగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, జీవితంలో క్రమశిక్షణ, ఏకాగ్రత అలవడతాయని తెలిపారు.

మైదాన ప్రాంత గిరిజనులకూ రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

నెహ్రూనగర్: రాష్ట్రంలో మైదాన ప్రాంత గిరిజనులకూ అన్ని పార్టీలు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సామాజిక, రాజకీయ వివక్షతకు అరికట్టేందుకు నియోజకవర్గాల వారీగా శాసనసభ, పార్లమెంటు టికెట్లను కేటాయించి వారి హక్కులకు రక్షణ కల్పించాలని కోరారు. అమరావతి రోడ్డులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులు నివసించే ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల్ని మెరుగు పరచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న 25 లక్షల మంది ఎరుకల, లంబాడా తదితర గిరిజన జనాభాకు కేటాయించిన ఏడు నియోజకవర్గాలు మినహా మైదాన ప్రాంతాల్లో ఉన్న 10 లక్షల మంది ఎటువంటి రిజర్వేషన్లకు నోచుకోలేదని తెలిపారు. మైదాన ప్రాంత గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ అల్కా తివారితో పాటు పలువురు లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల్ని కలిసి వినతిపత్రాలు కూడా అందజేసినట్లు పేర్కొన్నారు.